క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెం లో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పరవాడ: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. స్థానిక మండల విద్యాశాఖ(ఎంఈవో) కార్యాలయ సిబ్బందిని మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. పెండింగ్ బిల్లులతో పాటు కనీస వేతనంగా రూ.10 వేలు చెల్లించాలని, ఐడీ కార్డు, యూనిఫారం, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ అమలు చేసి, రాజకీయ వేధింపులు ఆపి, పని ఒత్తిడి, అక్రమ తొలగింపుల్ని నియంత్రించాలన్నారు. వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. పిల్లలకు ఇచ్చే మెనూ చార్జీలు పెంచాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

వృద్ధులకు సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సేవ



వృద్ధులకు కేశఖండన చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, అనాథలు, మానసిక వైకల్యం కలిగిన వారికి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మంగళవారం కేశఖండన సేవ చేశారు. ఆశ్రమంలో ఉన్న 120 మందికి ట్రస్ట్ ప్రతినిధులు స్వయంగా కేశ ఖండన చేశారు. అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, ప్రతినిధులు సిరిమళ్ల గణేష్, కందల నవీన్, దెందేటి కృష్ణ, కారి సూర్యనారాయణ, లయోలా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు మెరుగైన సేవలు



భవిత కేంద్రంలో చిన్నారితో ముచ్చటిస్తున్న గీత

పెందుర్తి: భవిత కేంద్రంలోని పిల్లలకు మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.గీత అన్నారు. శాంతినగర్‌లోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఇవ్వాల్సిన అలవెన్స్‌లు సమయానికి అందించాలన్నారు. ఫిజియోథెరపీతో పాటు ఇతర సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఏపీవో అప్పలనాయుడు, భవిత నిర్వాహకుడు ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



సీఎంఆర్ఎఫ్ ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పెందుర్తి ప్రాంతానికి చెందిన దొడ్డి ధనేశ్‌రామ్‌కు వినికిడి పరికరాలు అమర్చేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.4.39 లక్షలు మంజూరయ్యాయి. ఆ ధ్రువపత్రాన్ని సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా బాలుడి కుటుంబానికి అందించారు.

మిగిలున్నవి 28 రోజులే..!



అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్



విద్యార్థి దశలో ఉన్నత భవితకు తొలి మెట్టు పదో తరగతి. మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న పబ్లిక్ పరీక్షలకు వంద రోజుల ముందు నుంచే విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక సూచించింది. ఇప్పుడు మిగిలున్నవి 28 రోజులే..! శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అడవివరం జిల్లాపరిషత్ హైస్కూల్ ఆ ప్రణాళికను పక్కాగా అమలుచేస్తోంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా గ్రూపులుగా విభజించి, నిరంతర పర్యవేక్షణతో ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పక్కాగా 100 రోజుల ప్రణాళిక
- అడవివరం జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం అదనపు తరగతుల నిర్వహణ
- ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

సింహాచలం: అడవివరం జిల్లాపరిషత్ హైస్కూల్ నుంచి ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు 86 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరంతా ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచుతున్నారు. డైలీ స్లిప్ టెస్టులు, వీక్లీ టెస్టుల ద్వారా పబ్లిక్ పరీక్షల భయాన్ని దూరం చేస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 వరకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా మధ్యాహ్న భోజనం పెడుతూ, సబ్జెక్టుల వారీ ప్రత్యేక తరగతులతో విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.

గ్రూపులుగా విభజన–ప్రత్యేక పర్యవేక్షణ

పాఠశాలలో మొత్తం 18 మంది ఉపాధ్యాయులు న్నారు. టెన్త్ విద్యార్థులను అభ్యసన సామర్థ్యాల ఆధారంగా ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించారు. చదువులో కాస్త వెనుకబడిన వారిని సి, డి గ్రూపుల్లో ఉంచి, వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. అన్ని గ్రూపుల నుంచి ఏడుగురు విద్యార్థులు చొప్పున ఒక్కో ఉపాధ్యాయుడు దత్తత తీసుకుని, వారి అభ్యసన సామర్థ్యాలను నిరంతరం పరిశీలిస్తున్నారు. వారు ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ఆయా సబ్జెక్టులపై పట్టు సాధించేలా కృషి చేస్తున్నారు. స్టడీ మెటీరియల్ ఇచ్చి ప్రత్యేకంగా చదివిస్తున్నారు.



పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

వీక్లీ టెస్టులు - ప్రీ ఫైనల్ పరీక్షలు

ప్రత్యేక తరగతుల నిర్వహణలో ప్రతీ సబ్జెక్టుపైనా చాప్టర్ వైజ్ వీక్లీ టెస్టులు పెడుతున్నారు. తద్వారా వారంతా ఏ సబ్జెక్టుపై ఏ స్థాయిలో పట్టు సాధించారో తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రీఫైనల్-1 పరీక్షలను పకడ్బందీగా పాఠశాలలో నిర్వహిస్తున్నారు. పబ్లిక్ పరీక్షలు ఎలా జరుగుతాయో అదే స్థాయిలో ఈ పరీక్షలు కూడా జరుగుతుండటంతో విద్యార్థుల సామర్థ్యంపై తుది అంచనాకు వస్తున్నారు. ఎలాంటి భయాందోళన లేకుండా పబ్లిక్ పరీక్షలు రాసేందుకు అవసరమైన మానసిక స్థైర్యాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు.

విద్యార్థుల దత్తత-ఇంటికే వెళ్లి పరిశీలన

స్కూల్ సమయంలోనే కాకుండా ఇంటి వద్ద కూడా విద్యార్థులు చదివేలా ఉపాధ్యాయులు చొరవ చూపుతున్నారు. ప్రతి టీచర్ తాము దత్తత తీసుకున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి మరీ ఆరా తీస్తున్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇంట్లో చదువును ప్రోత్సహించే వాతావరణం ఉండేలా చూడాలని సూచిస్తున్నారు. ఫోన్ చేసి తరచూ మానటరింగ్ చేస్తున్నారు. ఎలాంటి సందేహాలున్నా ఫోన్‌లో నివృత్తి చేస్తున్నారు.



రాత్రి సమయంలో విద్యార్థి చదువుపై ఇంటికి వెళ్లి ఆరా తీస్తున్న ఉపాధ్యాయుడు

ప్రతీ విద్యార్థి పాసయ్యేలా..



టెన్త్‌లో ప్రతి విద్యార్థి పాసవ్వాలన్న లక్ష్యంతో వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. కొంచెం వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల మరింత శ్రద్ధ చూపుతున్నాం. వారికి మరింత సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నాం. స్టడీ మెటీరియల్‌ని అనుసరించి చదివిస్తున్నాం.

– ఇమంది పైడిరాజు, ప్రధానోపాధ్యాయుడు

ఉత్తమ ఫలితాల సాధనకై..



గతేడాది స్కూల్లో 81శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈసారి ఎస్‌సీఈఆర్‌టీ 100 డేస్ ప్రణాళిక ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఇళ్లకు వెళ్లి విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇస్తున్న కౌన్సిలింగ్ ద్వారా మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి.

– ఎం.శ్రీనివాసరావు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు

పరీక్షల భయం పోయింది



ప్రీ ఫైనల్ పరీక్షల ద్వారా పబ్లిక్ పరీక్షలు ఎలా ఉంటాయో అవగాహన ఏర్పడింది. దీంతో పబ్లిక్ పరీక్షలు అంటే భయం పోయింది. 100 డేస్ ప్లాన్ చాలా ఉపయోగపడుతోంది. మంచి మార్కులు సాధించగలనన్న నమ్మకం వచ్చింది. ఇందుకు కృషి చేసిన మా టీచర్లకు కృతజ్ఞతలు.

– వెన్నెల, 10వ తరగతి

వీక్లీ టెస్టులతో ఎంతో మేలు



వంద రోజుల మాస్టర్ ప్లాన్ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుంది. ఉదయం, సాయంత్రం అదనపు తరగతుల ద్వారా డౌట్లు క్లియర్ చేసుకుంటున్నాం. ప్రణాళిక ప్రకారం చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. వీక్లీ టెస్టుల వల్ల మరింత మేలు కలుగుతోంది.

– భాను, 10వ తరగతి

టీచర్ల హెల్ప్ మర్చిపోలేం



ప్రతీ విద్యార్థి మంచి మార్కులతో పాసవ్వాలని మా టీచర్లు చేస్తున్న కృషి ఎంతో బాగుంది. మా ఇళ్లకు వచ్చి మరీ మేం ఎలా చదువుతున్నామో తెలుసుకుంటున్నారు. మా తల్లిదండ్రులను ఆరా తీసి, ఇంట్లో ఆ విధమైన వాతావరణం ఉండేలా సలహాలిస్తున్నారు. వారి మేలు మర్చిపోలేం.

– కె.జగన్‌వర్మ, 10వ తరగతి

ఘనంగా దుర్గాలమ్మ తీర్థమహోత్సవం





పూజలందుకున్న దుర్గాలమ్మ, విద్యుత్ దీపాలతో ముస్తాబైన దుర్గాలమ్మ ఆలయం

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో కొలువైన దుర్గాలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి సబ్బవరం వాసులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సాయంత్రం నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రోగ్రాం ఆకట్టుకుంది. అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో పాటు పలువురు నేతలు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవం.. రామచంద్రమ్మ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, తదితరులు



ఉత్సవంలో భాగంగా పురవీధిలో ఏర్పాటు చేసిన హనుమాన్ సినిమా భారీ సెట్టింగ్



స్టేజ్ ప్రదర్శనల్లో ఉర్రూతలూగించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామ ప్రజల ఆరాధ్యదైవం రామచంద్రమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు తమ అనుచర గణంతో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్‌వీ శ్రీనివాసరావులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

వేకువ జాము నుంచే అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల కోసం ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సాయంత్రం సతకంపట్టు తర్వాత, అమ్మవారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాది భక్తులు పాల్గొన్నారు. డప్పులు, చిడతలు, తప్పెటగుళ్లు, నేల డ్యాన్సులతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. కనులు మిరమిట్లు గొలిపే బాణ సంచా వెలుగుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్, చిడతల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఉక్కు అమర వీరులకు నివాళి

ఆవిర్భావ వేడుకలు నిర్వహించకపోవడంపై కార్మికుల మండిపాటు



ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించక పోవడం దుర్మార్గమని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉక్కునగరం స్మృత్యంజలి పార్కు వద్ద నాయకులు ఉక్కు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనేక మంది బలిదానాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌కు ఆవిర్భావ దినోత్సవాన్ని గతేడాది వరకు యాజమాన్యం నిర్వహించిందన్నారు. ఈ ఏడాది అర్ధంతరంగా వేడుకలను నిలిపివేయడం ఏంటని ప్రశ్నించారు. ఉక్కు ఉత్పత్తి కోసం క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు నెహ్రూ అవార్డులతో సత్కరించాల్సిన కార్యక్రమాన్ని ఎందుకు నిలిపేశారన్నారు. యాజమాన్యం తమన మొండి వైఖరి మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, జె.అయోధ్యరామ్, యు. రామస్వామి, కారు రమణ, వరసాల శ్రీనివాస రావు, రామ్మోహన్‌కుమార్, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 80 గ్రాముల బంగారు ఆభరణాల అపహరణ

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా మూడో రోజు కూడా చోరీ జరిగింది. వివరాలివి.. పెందుర్తి సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఉన్న ఆకెళ్ల గౌరీశంకర్ ఇంటికి తాళం వేసి, కుటుంబంతో కలిసి శుక్రవారం రాత్రి అగనంపూడిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 80 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు క్రైం ఎస్‌ఐ డి.సూరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్లో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 8 ద్విచక్ర వాహనాలను గురువారం వేలం వేయనున్నట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ 31ఏక్యూ 0800, ఏపీ 32సి 5585, ఏపీ 32ఎ 3119, ఏపీ 32ఎ 1962, ఏపీ 30ఇ 6016, ఏపీ 37ఆర్ 9978, ఏపీ 05ఎఫ్ 9104, ఎంహెచ్ 43టి 0982 నంబర్లు గల ద్విచక్ర వాహనాలు చాలా ఏళ్లుగా పలు కేసుల్లో స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచామన్నారు. మండల మెజిస్ట్రేట్, తహసీల్దార్ ఉత్తర్వుల మేరకు వేలం వేస్తున్నామన్నారు.

జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి



జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 రవీంద్రబాబు

సబ్బవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి జె.రవీంద్రబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆరిపాక జెడ్పీ హైస్కూల్లో తొలి విడత జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని సీడీపీవో లలితకుమారితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. నూతన విద్యా విధానంలో భాగంగా పునాది అభ్యసన, భాష, సంఖ్య జ్ఞానంలో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. రెండు విడతల్లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి విడత ఈ నెల 18 నుంచి 20 వరకు, రెండవ విడత ఈ నెల 22 నుంచి 25 వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సబ్బవరం ప్రధానోపాధ్యాయులు రాధాకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు ప్రారంభం



అంగన్‌వాడీలతో మాట్లాతున్న సీడీపీవో నీలవేణి

పెందుర్తి: 3–5 ఏళ్ల పిల్లల పునాది అభ్యసన మెరుగుపరచడంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు 6 రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో నీలవేణి మాట్లాడుతూ పిల్లలను సమగ్రాభివృద్ధి దిశగా నడిపించే బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందన్నారు. పలు అంశాలపై వారికి సూచనలు, సలహాలు అందించారు. ఎంఈవో-1 కె.సువర్ణ, పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం చిన్నమ్మాయి, డీపీఆర్‌లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

టెండర్ల ఖరారులో జాప్యమేల?

దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధుల ఆవేదన

అగనంపూడి: విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయ భవనాల నిర్మాణానికి ప్రధాన మంత్రి మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసి రెండు మాసాలు కావస్తున్నా నేటికీ టెండర్లు ఖరారు చేయకపోవడంపై దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మండిపడుతున్నారు. దువ్వాడలో అసోసియేషన్ ప్రతినిధులు కె.ఈశ్వర్, కె.చంద్రరావు మంగళవారం మాట్లాడారు. రూ.149.16 కోట్ల వ్యయంతో 24 నెలల వ్యవధిలో పూర్తి చేయడానికి భువనేశ్వర్‌లోని తూర్పు కోస్తా రైల్వే అధికారులు టెండర్లు పిలిచారని, రెండు మాసాలు కావస్తున్నా నేటికీ ఖరారు చేయలేదన్నారు. ఇంకా 22 నెలల్లో భవన నిర్మాణ పనులు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరితే ఇంకా టెండర్ల ఖరారు చేసే పనిలో ఉన్నామని సమాధానం ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. రైల్వే మంత్రి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ఎంపీ స్పందించి వెంటనే టెండర్లు ఖరారు చేయించి, పనులు చేపట్టేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

32 మంది ప్రాణత్యాగ ఫలితమే స్టీల్‌ప్లాంట్



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం వైఎస్సార్‌టీయూసీ యూనియన్ పాయింట్ వద్ద నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వ్యవస్థాపక దినోత్సవాన్ని యాజమాన్యం అధికారికంగా చేయకపోవడం వెనుక కుట్ర ఉందన్నారు. ఒకవైపు ప్యాకేజీ ఇచ్చామని చెబుతూ జీతాలు ఇవ్వకుండా, ఇలాంటి కార్యక్రమాలు నిలిపివేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, దరిగి రవి, జి.పి.ఆర్. రెడ్డి, జి.అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువకు అడ్డంకిగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కాలువకు అడ్డంకిగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పరవాడ: మండలంలో పి.బోనంగి శివారు వి.ఎల్.ఎన్ పురంలో సీసీ కాలువ నిర్మాణానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అడ్డంకిగా మారింది, ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రదేశానికి తరలించాలని గ్రామ ఉప సర్పంచ్ గొంతిన రాము కోరారు. ఈ మేరకు ఇటీవల నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డును ఆనుకుని ఏర్పాటు చేయడంతో రహదారి ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు చర్యలు తీసుకోవాలని కోరారు.